క్లుప్తంగా

17న వాహనాల వేలం

రాజాం సిటీ: స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ బి.శ్రీధర్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన జరిగే ఈ వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొని, వాహనాలను సొంతం చేసుకోవాలన్నారు.

కౌలు రైతులకు రుణసాయం అందించాలి



పాగిరి ఏపీజీవీబీ బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న ఏవో రేణుకాసాయి

రాజాం సిటీ: మండల వ్యాప్తంగా ఉన్న కౌలురైతులందరికీ రుణసాయం అందించాలని ఏవో ఎం.రేణుకాసాయి కోరారు. మండల పరిధిలోని పాగిరి ఏపీజీవీబీ బ్యాంకు అధికారులతో మంగళవారం సమావేశమైన ఆమె.. కౌలురైతులకు పంట రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మండలంలో రాజాం, పాగిరి ఏపీజీవీబీ, రాజాం యూనియన్ బ్యాంకు, బొద్దాం కెనరా బ్యాంకు పరిధిలో మొత్తం 469 మంది కౌలురైతులు ఉన్నారన్నారు. కౌలురైతులు కూడా ప్రభుత్వ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీబీఎం స్కూల్ వ్యవహారంపై విచారణ



సీబీఎం స్కూల్ సిబ్బందిని విచారణ చేస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం స్కూల్ విక్రయ వ్యవహారంపై తహసీల్దారు ఎం.శ్రీను మంగళవారం విచారణ చేపట్టారు. ఆ స్కూల్ వద్దకు సిబ్బందితో కలిసి మంగళవారం వెళ్లిన ఆయన.. పాఠశాల స్థాపన, అప్పటి రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇటీవల స్కూల్ రెన్యువల్ కోసం కరస్పాండెంట్ రత్నకుమార్ సంతకాలు చేసిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం పాఠశాల భవనం, విస్తీర్ణం, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలను ప్రధానోపాధ్యాయులు సునేత్రిని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీదేవిల వద్ద కూడా కొన్ని వివరాలు సేకరించారు. అనంతర ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ అమ్మేస్తున్నారనే విషయంపై ఇటీవల పలు వార్తాపత్రికల్లో కథనాలు వెలువడ్డాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ, నాయుడు కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. వర్షాల కారణంగా ప్రధాన వీధులు, రోడ్లు, కాలువల్లోకి చేరిన చెత్తాచెదారం తొలగించాలని, పల్లపు ప్రాంతాల్లో నిలిచిన వరదనీటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట టీపీవో వరప్రసాద్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళి తదితరులు ఉన్నారు.

రూ.6 వేలకు గణపతి లడ్డూ వేలం

రాజాం: పట్టణంలోని వేంకటేశ్వరనగర్‌లో వినాయక లడ్డూ వేలంపాట మంగళవారం నిర్వహించారు. అదే ప్రాంతానికి చెందిన తుల సీకిశోర్ అనే భక్తురాలు రూ.6 వేలకు లడ్డూను దక్కించుకుంది. అనంతరం ఆ లడ్డూ ప్రసాదాన్ని ఆ ప్రాంతంలోని ఇంటింటికీ పంచిపెట్టారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

రాజాం: జీవో నంబర్ 85ను వ్యతిరేకిస్తూ స్థానిక పట్టణంలోని అర్బన్, రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులంతా నల్లబ్యాడ్జీలు ధరించి, మంగళవారం విధులకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ ఆందోళన నిర్వహిస్తున్నామని, జీవో నంబర్ 85ను రద్దు చేయాలని గత రెండు నెలలుగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పలువురు వైద్యులు తెలిపారు. సదరు జీవో కారణంగా వైద్యులకు అన్యాయం జరుగుతుందని, జీవో రద్దు వరకు తమ పోరాటం ఆగదన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

రామభద్రపురం: వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులు చెరువుల వద్ద జాగ్రత్తలు పాటించాలని సీఐ నారాయణరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆయన తెలిపారు.

కుంగిన కాజ్‌వేలు.. కోతకు గురైన రోడ్లు!



సంతకవిటి: సిరిపురం వద్ద కుంగిన కాజ్‌వే మీదుగా ప్రమాదకరంగా ఆటో ప్రయాణం



బొబ్బిలి రూరల్: పారాది వద్ద వరదలకు కొట్టుకుపోయిన కాజ్‌వే



సంతకవిటి: వరదల కారణంగా రాళ్లు తేలిన మందరాడ-ముకుందపురం రోడ్డు

వరదల కారణంగా పలుచోట్ల కాజ్‌వేలు కుంగిపోయాయి.. మరికొన్ని చోట్ల రోడ్లు పూర్తిగా కోతకు గురయ్యాయి. దీంతో అటువైపుగా వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కుంగిపోయిన కాజ్‌వేల వద్ద ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాళ్లు తేలిన రోడ్ల మీదుగా ప్రయాణం చేస్తుంటే నరకయాతన పడుతున్నామంటున్నారు. ఆదమరిస్తే ఆపదేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–సంతకవిటి, బొబ్బిలి రూరల్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు



వంగర: పీహెచ్‌సీ వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

రాజాం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. స్థానిక పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఉన్న అర్బన్ పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీల వారీగా ప్రజల ఆరోగ్య పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రస్తుతం జ్వరాలు అధికంగా ప్రబలే పరిస్థితి ఉందని, వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారంలో రెండు సార్లు ప్రతీ పంచాయతీలో ఫీవర్ సర్వే చేయాలని తెలిపారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా ఇతర వైరల్ జ్వరాల బారిన ప్రజలు పడకుండా అవగాహన కల్పించడం, వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్యసేవలు అందివ్వడం వంటివి చేయాలన్నారు. ప్రతీ పంచాయతీలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను సమర్థవంతంగా పూర్తిచేయాలన్నారు. ఈ నెల 17వ తేదీన చేపట్టాల్సిన డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఆదర్శనగర్, బుచ్చింపేట యూపీహెచ్‌సీలతో బొద్దాం, పాగిరి, సంతకవిటి, మండాకురిటి, రేగిడి, బూరాడ, వంగర, అరసాడ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో తగ్గిన డెంగీ కేసులు

వంగర: ప్రస్తుతం సీజనల్‌గా వస్తున్న వ్యాధుల పట్ల రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన వంగర పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలోని మందుల గదితోపాటు రక్తపరీక్ష కేంద్రం, ఆస్పత్రి ఆవరణను పరిశీలించారు. పీహెచ్‌సీలో సమస్యల గురించి వైద్యులు జ్యోతి, సుస్మితా దయానాలను అడిగితెలుసుకున్నారు. 24 గంటలు సేవలందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో డెంగీ కేసులు తగ్గుముఖం పట్టాయని, జనవరి నుంచి ఇప్పటివరకు 132 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. సకాలంలో వైద్యసేవలు అందడంతోనే ఇప్పటివరకు మలేరియా, డెంగీ మరణాలు నమోదుకాలేదని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా అంతటా వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని, ప్రతిరోజూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రాజు, అనిల్ ప్రేమ్‌కుమార్, సత్తిరాజు, పీహెచ్‌సీ సిబ్బంది సురేష్, దమయంతి, తవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేదు..

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



రాజాం: ప్రజల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేదని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పబ్లిసిటీ మీద ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలు రక్షించడంలో లేదన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతీసారి ఏదో కారణంగా రాష్ట్రంలోని అమాయకపు ప్రజలు మృత్యువు బారినపడుతున్నారన్నారు. విజయవాడ వరదల్లో కూడా ప్రభుత్వ తప్పిదం వల్లే ఎంతోమంది మరణించడం చాలా బాధాకరమన్నారు. వరద ముప్పు ప్రభుత్వానికి ముందే తెలిసినా ప్రజలను తప్పించలేకపోయిందన్నారు. వరదల సమయంలో, వరదల అనంతరం కూడా సహాయక చర్యల్లో చంద్రబాబు సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. కరకట్టను ఆనుకుని ఉన్న చంద్రబాబు నివాసాన్ని కాపాడేందుకు వరదనీటిని మళ్లించడం వల్లే విజయవాడకు వరదలు వచ్చాయని ధ్వజమెత్తారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన కరకట్ట వల్లే అక్కడి ఎన్నో గ్రామాలు సురక్షితంగా ఉన్నాయని, ఎంతోమంది ప్రాణాలు నిలబడ్డాయన్నారు. ఇప్పటికీ ముంపు బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. 2014–15లో పుష్కరాల సమయంలో 30 మంది ప్రాణాలను అప్పటి చంద్రబాబు ప్రభుత్వమే బలిగొందని గుర్తుచేశారు. ఇప్పుడు తుపాను వర్షాలు వస్తాయని తెలిసినా ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయకపోవడం చేతనే విజయవాడను వరదలు అతలాకుతలాం చేశాయన్నారు. భారీగా ఆస్తినష్టం సంభవించడంతో పాటు 50 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విజనరీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు వరదలు వస్తాయని తెలిసినా ప్రజలకు ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నించారు. దీనంతంటికీ చంద్రబాబు అసమర్థతే కారణమని స్పష్టంగా తెలుస్తోందన్నారు. 2020–22లో కోవిడ్ విపత్తు సమయంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంత సమర్థవంతంగా పనిచేసి, ఎంతమంది ప్రాణాలు కాపాడిందో దేశం మొత్తం చూసిందన్నారు. గతంలోని రేషన్ పంపిణీ వాహనాలపై విమర్శలు చేసిన చంద్రబాబే ఇప్పుడు విజయవాడలో వరద బాధితుల కోసం వాడుతున్నారన్నారు. ప్రస్తుతం వరదలు తగ్గుముఖం పట్టినా ఎక్కడా పరిస్థితిని చక్కదిద్దే సూచనలు కనిపించడం లేదన్నారు. ఎక్కడ చూసినా సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్న వారే తప్ప ప్రభుత్వ సాయమందింది బాగున్నామని చెప్పేవారు కరువవడం విచారకరమన్నారు. బురద రాజకీయాలు వీడి, ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తుప్పల్లోకి దూసుకెళ్లిన మినీవ్యాన్

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామ రోడ్డులో త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం అదే రోడ్డు మీదుగా రామభద్రపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న మినీవ్యాన్ అదుపుతప్పి, అక్కడి వేంకటేశ్వరాలయం ఎదురుగా ఉన్న తుప్పల్లోకి దూసుకువెళ్లింది. వ్యాన్‌లో డ్రైవరు ఒక్కడే ఉండగా, అదృష్టవశాత్తు అతడికి ఎటువంటి గాయాలు కాలేదు. ఒకవేళ ప్రయాణికులు ఉండి ఉంటే పరిస్థితి ఏమిటని, పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు అంటున్నారు. అదే రోడ్డులో భారీ గోతుల కారణంగానే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్టవలస నుంచి గొర్లెసీతారాంపురం వరకు రోడ్డు అంతా అధ్వానంగా ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

23 హెక్టార్లలో పంటనష్టం!

బొబ్బిలి: తుపాను వర్షాల కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా 23 హెక్టార్లలో పంటనష్టం సంభవించి, ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేసి అధికారులకు నివేదించామని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ మంగళవారం తెలిపారు. బొబ్బిలి మండలంలో 13 హెక్టార్లలో, తెర్లాం మండలంలో 5 హెక్టార్లలో, బాడంగి మండలంలో 5 హెక్టార్లలో పంటలు నేలకూలినట్లు గుర్తించామన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లో పౌష్టికాహార ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని వెంకటరంగారాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం–దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీవర్ సర్వే చేయండి



రేగిడి: వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి, సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో ఫీవర్ సర్వే తప్పనిసరిగా చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సూర్యనారాయణ సూచించారు. మండలంలోని ఆమదాలవలస, సంకిలి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాల నేపథ్యంలో నీటి కలుషితం, అపారిశుధ్యం కారణంగా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, ఈ మేరకు గ్రామస్తులను అప్రమత్తం చేయాలని వైద్యారోగ్య సిబ్బందికి తెలిపారు. ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితులు ఎవరైనా ఉన్నారా లేదా అనే విషయం తెలుసుకుని, అవసరమైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఏదైనా గ్రామంలో ఎక్కువ మంది జ్వరాలతో బాధపడితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ అసిరినాయుడు, సూపర్‌వైజర్ అప్పారావు, సీహెచ్‌వో సుందరేశ్వరరావు పాల్గొన్నారు.



రాజాం: బొద్దాంలో ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజాం: మండలంలోని బొద్దాం, గార్రాజుచీపురుపల్లి, పెనుబాక తదితర గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే మంగళవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం పర్యటించి, ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితులపై ఆరాతీశారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



కొండకెంగువ భూముల వివరాలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో సాయిశ్రీ

రామభద్రపురం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ అన్నారు. మండలంలోని కొండకెంగువ రెవెన్యూ పరిధిలో ఇటీవల జరిగిన భూముల రీసర్వేలో ఓ రైతుకు సంబంధించిన జిరాయితీ భూమి పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదైంది. ఆ సమస్యను తహసీల్దారు సులోచన రాణితో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. తహసీల్దారుతో పాటు మండల సర్వేయరు, వీఆర్‌వో, గ్రామ సచివాలయ సర్వేయర్లను అడిగి, ఆ భూమి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ రికార్డులు పరిశీలించి, కాసేపు మాట్లాడారు. రీ సర్వేలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదు అయిందని, పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. భూముల విషయంలో రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చూసుకుంటామన్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి రామభద్రపురంలోని బాడంగి రూట్‌లో ఉన్న మూడడ్ల వారి కళ్లాలను పరిశీలించారు. అక్కడ ఇసుక డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలి



చిన్నయ్యపేటలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దనరావు

రేగిడి: వరదల కారణంగా పంటనష్టం వాటిల్లినందున ఎకరాకు రూ.20 వేలు చొప్పున పంట నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డవలస, సంకిలి, చిన్నయ్యపేట, రేగిడి, ఆమదాలవలస తదితర గ్రామాల్లో నీటమునిగిన పంటపొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. వరదల కారణంగా భారీ ఎత్తున పంటనష్టం జరిగిందని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి, నష్టాన్ని అంచనా వేయాలన్నారు. సాయన్నచానల్, తునివాడ, రేగిడి, అవుకుబట్టి కాలువల మరమ్మతులను కొన్నాళ్ల నుంచి చేపట్టకపోవడంతో పంటపొలాలను వరదలు ముంచెత్తుతున్నాయన్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వమే తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరారు.

పత్ర కషాయం తయారీపై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో పత్ర కషాయం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శంకరరావు, శ్రీరాములు, కన్నంనాయుడులు కలిసి వివిధ ఆకులతో పత్ర కషాయం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం దాని ప్రయోజనాలు తెలిపారు. వరి పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు పత్ర కషాయం బాగా ఉపయోగపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి సేద్యం చేసేందుకు ఆసక్తి కనబరచాలన్నారు.

ముంచెత్తిన వరద

సంతకవిటి: తుపాను వీడినా సాయన్నగెడ్డ వరదనీరు పంటపొలాలను ముంచెత్తింది. దీంతో పొలాలన్నీ ఇప్పుడు చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లో ఇంకా వరదనీరు తగ్గకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సాయన్నగెడ్డలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగిస్తే తప్ప వరద తగ్గే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికీ వరదనీరు తగ్గక పోవడంతో మల్లయ్యపేట హొంజరాం గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రేగిడి: వర్షాలు తగ్గుముఖం పట్టినప్పట్టికీ రేగిడి గ్రామాన్ని వరద వీడడం లేదు. ఎగువ ప్రాంతాల్లోని భారీ వర్షాలకు ఆకులలోవకట్టగెడ్డ నీరు పొంగి ప్రవహిస్తోంది. రేగిడి గ్రామం చుట్టూ వరదనీరు యథావిధిగా ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రజల రాకపోకలు వరదనీటిలోనే కొనసాగుతున్నాయి.

రాజాం: వాన తెరిపిచ్చినా వరదనీటి ప్రభావం మాత్రం ఎక్కడా తగ్గలేదు. రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వరదనీరు పెద్దఎత్తున నిల్వ ఉండడంతో విద్యార్థులు, అధ్యాపకులు అవస్థలు పడుతున్నారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని మెంతిపేట ఎస్సీకాలనీ, గాయత్రీ కాలనీ, సారథి, ఇందిరమ్మ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో వరదనీటి నిల్వలతో పాటు పారిశుద్ధ్య లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సంతకవిటి: రామారాయపురం వద్ద చెరువును తలపిస్తున్న పంటపొలాలు

నిమజ్జనాల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు



కమిటీల ఏర్పాటు, విధులపై చర్చిస్తున్న అధికారులు

బొబ్బిలి రూరల్: వినాయక నిమజ్జనాల పర్యవేక్షణకు సంబంధించి, ప్రత్యేక కమిటీలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎం.శ్రీను ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గణేశుని నిమజ్జనోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. పట్టణంలో నిమజ్జనాల పర్యవేక్షణకు సచివాలయ అడ్మిన్, మహిళా పోలీస్, వీఆర్‌వోతో పాటు మరో ఇద్దరిని కమిటీ సభ్యులుగా నియమించారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో జరిగే గణపతి నిమజ్జనం పర్యవేక్షణకు సచివాలయ కార్యదర్శి, మహిళా పోలీస్, వీఆర్‌వోతో పాటు మరో ఇద్దరిని ఏర్పాటు చేశారు. నిమజ్జనం ఆద్యంతా ప్రశాంతంగా జరిగేలా చూడడంతో పాటు విగ్రహ ఊరేగింపులో ఎటువంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా చేయడమే ఆయా కమిటీల సభ్యుల బాధ్యతలుగా తహసీల్దారు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, సీఐ సతీష్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.